# కరటి పక్షి

"దీని పేరేమిటి?"

"కరట పక్షి" చెప్పాడు దామోదరం.

ముదురు నీలిరంగులో వుంది ఆ పక్షి. మెడదగ్గర కొంచెం ఎర్రగా వున్నది. దాని కళ్ళు మెరుస్తున్నాయి. భయంగా మావైపు చూస్తూ పంజరంలో అటూ ఇటూ తిరుగుతోంది. చిన్నపక్షి. ముద్దుగా వుంది.

"ఎక్కడ దొరికింది?" అడిగాను చేత్తో పంజరంమీద కొడుతూ-

ఆ పక్షి వులిక్కిపడి చిన్నగా అరిచింది. దాని అరుపు అదోలా వుంది కీచుమంటూ.

నాలుగురోజుల క్రితం ఏలూరువెళ్ళి ఆరోజునే తిరిగి వచ్చాను. వచ్చీరాగానే మా ప్రక్కయింట్లో వుండే దామోదరం ఓ పక్షిని తీసుకు వచ్చి పంజరంలో బంధించిన విషయం తెలిసింది. వెంటనే వచ్చాను.

ఆ పక్షి ఎక్కడ దొరికిందని నేనడిగిన ప్రశ్నకు "మూడు రోజుల క్రితం నేను- మా ఆఫీసర్ క్యాంపుకు వెళ్ళి జీపులో తిరిగి వస్తున్నాం. వెళుతోంది జీపు. ఇంతలోనే ఈ పక్షి రివ్వున ఓ చెట్టు మీదనించి దూసుకువచ్చింది. జీపు అద్దానికి కొట్టుకుని రోడ్డు పక్కన పడిపోయింది. డ్రయివర్‌ని జీపు ఆపమని దిగివెళ్ళి దీన్ని తీసుకు వచ్చాను. చూడటంతోనే కరటపక్షి అనిగ్రహించాను. ఒకరోజు తర్వాతగానీ ఇది షాక్‌నించి తేరుకోలేకపోయింది".

అలా చెబుతున్నప్పుడు దామోదరం కళ్ళలో ఏదో మెరుపు కని పించింది నాకు. అంత దిగులులోనూ అతని ముఖంలో కనిపిస్తున్న తృప్తి నేను గమనించి ఆశ్చర్యపోయాను.

ఎందుకంటే- వారం రోజులక్రితం దామోదరం రెండో కొడుకు ఇరవై యేళ్ళవాడు కొంత డబ్బు తీసుకుని ఇంట్లోనించి వెళ్ళిపోయాడు. అతనికోసం దామోదరం ఎంతగానో వెతికాడు. ఎక్కడా కొడుకు ఆచూకీ తెలీలేదు. అందువల్ల అతను చాలా దిగులుగా వున్నాడు.

"ఇంతకీ మీఅబ్బాయి గురించిన ఆచూకీ ఏదయినా తెలిసిందా?" అని అడిగాను దామోదరాన్ని.

"తెలీలేదుకాని ఓ రెండు రోజుల లోపలే వాడు తిరిగొస్తాడు" అన్నాడు దామోదరం గట్టిగా.

"అంతగట్టిగా ఎలా చెప్పగలవు?" కుతూహలంగా అడిగాను.

నా ప్రశ్నకు జవాబుగా దామోదరం– పంజరంలో తిరుగుతున్న కరటపక్షిని చూపించాడు.

"అంటే"

"వివరంగా చెబుతాను. ఈ పక్షి గురించి నీకు ఇంతవరకు చెప్పలేదు. నిజానికి ఈ పక్షిగురించి చాలా తక్కువ మందికి తెలుసు. దీనికి మరోపేరు అదృష్టపక్షి.... నా చిన్నతనంలో ఓ పుస్తకంలో దీన్ని గురించి చదివాను. ఈ పక్షి ఇంట్లోవుంటే ఆ ఇంటికి మేలు జరుగుతుందిట. అదృష్టం కలిసివస్తుందిట.... నా అదృష్టం.... ఇది నాకు దొరికింది. ఈ కరటపక్షులు చాలా రేర్‌గా వుంటాయి. అందుకే ఇది దొరికిన వెంటనే పారిపోవటానికి వీలులేకుండా పంజరం కొని తెచ్చాను" అన్నాడు దామోదరం నన్ను చూస్తూ.

నిజంగా ఆశ్చర్యం! ఆ పక్షి ఇంట్లోవుంటే అదృష్టం కలుగుతుందా? నమ్మకం చాలా చిత్రమైనది. అది అనేక విధాలుగా వుంటుంది. వాటిల్లో ఇదో రకమైన నమ్మకం అనిపించింది.

నాకు ఇలాంటి పిచ్చినమ్మకాలు, విశ్వాసాలు లేవు.

"ఏమో! ఈ పక్షిపేరునే ఇంతవరకు విన్లేదు. దీన్ని చూడలేదు. ఐనా దీనివల్ల ఏదో మేలు జరుగుతుందని నేను నమ్మటంలేదు"అన్నాను సిగరెట్టు ముట్టిస్తూ.

"నీకు తెలీదు. నేను చెప్పినా తెలీదు. ఐనా దీని మీద నాకు నమ్మకం వుంది. నీ అభిప్రాయం సరయినదికాదని త్వరలోనే తెలుసుకుంటావ్".

పంజరం తలుపును గట్టిగా నొక్కి దాన్ని బల్లమీద వుంచాడు.

కొంచెంసేపటి తర్వాత దామోదరం కూతురు సునీత రెండు గ్లాసులలో కాఫీ తీసుకొచ్చి నాకో గ్లాసు ఇచ్చింది....

కాఫీ తాగుతూ "మళ్ళీ సంబంధాల వేటలో పడలేదా?" అని అడిగాను....

".... పడాలి. సుపుత్రుడి ఆచూకీ తెలియకపోవడంవల్ల ఇల్లు కదల్లేకపోయాను" అన్నాడు.

ఆ తర్వాత దామోదరం ఓ గంటసేపు కరటపక్షి అందం గురించీ, దాని గొప్పతనం గురించీ చెప్పాడు.... ఆ పక్షి తనకు దొరకటం తన పూర్వజన్మ పుణ్యం అనికూడా అన్నాడు. నేను అక్కడ వున్నప్పుడే దానికి ఆహారం పెట్టాడు. కాని అది భయంవల్ల తినకుండా పంజరంలో తిరగటం మొదలుపెట్టింది. చిన్న ముక్కును అటూ ఇటూ తిప్పుతూ....

ఒకరోజు గడిచింది.

రెండో రోజు సాయంత్రం దామోదరం కొడుకు యింటికి తిరిగొచ్చాడు. డబ్బు అయిపోయిందిట. ఓ ఫ్రెండ్‌తో కలిసి మద్రాసు, మహాబలిపురం తిరిగి వచ్చాడుట.

నేను వెళ్ళేసరికి కరటపక్షికి ఆహారం పెడుతున్నాడు దామోదరం.

నాలోవున్న ఆశ్చర్యాన్ని నా కళ్ళలో కనపడనీయకుండా జాగ్రత్త పడ్డాను. ఎందుకంటే దామోదరం చెప్పినట్టుగా రెండ్రోజుల్లోనే అతని కొడుకు తిరిగివచ్చాడు.

"చూశావా.... మావాడు తిరిగివచ్చాడు. అంతా కరటపక్షి అదృష్టం.... ఏమంటావ్?" అన్నాడు దామోదరం సంతోషంగా.

కొంచెం భయం తగ్గినట్లయింది. ఆహారాన్ని తింటోంది కరటపక్షి.

"ఐనా నేను నమ్మలేకుండా వున్నాను. ఒకవేళ ఈ కరటపక్షి నీకు దొరక్కుండావున్నా నీ కొడుకు తిరిగివచ్చే వాడేమో ఈ రోజు" అన్నాను కావాలనే

"ఇందుకు నేను ఒప్పుకోను" అన్నాడు అతను నవ్వుతూ—

ఆ మరురోజు ఉదయమే దామోదరం కూతురి పెళ్ళి సంబంధం గురించి ఓ వూరు వెళ్ళాడు. ఆ రాత్రికే తిరిగి వచ్చాడు.

ఆతర్వాత రెండ్రోజులకు పెళ్ళిచూపులు జరిగాయి. దామోదరం కూతురు వాళ్ళందరికీ నచ్చింది. అతను ఇవ్వచూపిన కట్నం కూడా నచ్చింది. ఆ రోజునే ముహూర్తాలు కూడా పెట్టుకున్నారు.

ఈ విషయం తెలిసిన తర్వాత నా భార్య నన్ను సాధించటం మొదలుపెట్టింది. నాకూ పెళ్ళికి ఎదిగిన ఓ కూతురున్నది. దానికి సంబంధాలు చూస్తున్నాముగానీ ఒక్కటీ ముడిపడలేదు.

పెళ్ళివారు వెళ్ళిపోయిన తర్వాత నాతో అన్నాడు దామోదరం– "ఇప్పటికయినా ఒప్పుకుంటావా? ఇదంతా కరటపక్షి అదృష్టం.... మూడేళ్ళనించీ నా కూతురికి సంబంధాలు చూస్తున్నాము. ఈ కరటపక్షి వచ్చిన తర్వాత ఇప్పటికి కుదిరింది".

నేనేమీ మాట్లాడలేదు.

ఓ ఇరవై రోజుల తర్వాత దామోదరం కూతురు పెళ్ళయి భర్తతో కాపురానికి వెళ్ళిపోయింది.

నా స్నేహితుడి కూతురు పెళ్ళికావడంతో నాలోనూ ఆత్రుత బాగా హెచ్చింది. వెనక నా భార్యరొద.... తీవ్రమయిన ప్రయత్నాలు చెయ్యటం మొదలుపెట్టాను.

అయినా ఒక్కటీ ఫలించటం లేదు. పెళ్ళిచూపులకు వచ్చిన వాళ్ళందరూ టఫిన్‌చేసి కాఫీ తాగి వెళ్ళిపోతున్నారు మా అమ్మాయి కొంచెం చాయ తక్కువ కావటంవల్ల ఎవరికీ నచ్చటం లేదు.

ఓ రోజు హఠాత్తుగా దామోదరం కొడుకు మళ్ళీ ఇంట్లోనించి కొంత డబ్బుతీసుకుని చెప్పకుండా వెళ్ళిపోయాడని తెలిసింది నాకు.

మళ్ళీ దామోదరం దిగులు పడిపోయాడు కొడుకు ప్రవర్తన గురించి. మొదటిసారి అలా చెప్పకుండా వెళ్ళిపోయినందుకు కొడుక్కి హితబోధ చేశాడు. అయినా అతడు మళ్ళీ వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత నాలుగు రోజులకే దామోదరం నన్ను పిలిచి ఓ విచారకరమైన విషయం చెప్పాడు. ఆ రోజునే అతని కూతురు దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందిట. అందులో ఆమె భర్త మంచివాడు కాదనీ, అన్ని దుర్గుణాలు వున్నాయనీ, రోజూ తాగొచ్చి కొడుతున్నా

డనీ రాసిందిట. ఈ విషయాన్ని చెప్పి కంటతడి పెట్టాడు దామోదరం. నాక్కూడా బాధనిపించింది ఆ విషయం వినగానే.

ఆ రాత్రంతా అతను చెప్పిన విషయమే నాకు గుర్తుకువచ్చింది. దిగులునిండి జీవంలేని దామోదరం ముఖమే నాకళ్ళముందు కదిలింది.

మరుసటి రోజు ఉదయం ఎనిమిదిన్నర అవుతుండగా దామోదరం ఇంటికి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి అతను కరటపక్షిని పంజరంలో నించి బయటకు తియ్యబోతున్నాడు.

నన్ను చూసి "దీన్ని వదిలి పెడుతున్నాను" అన్నాడు దాన్ని బయటకు తీసిపట్టుకుని.

"ఎందుకు వదిలెయ్యడం?" అని అడిగాను ఆశ్చర్యంగా.

"ఇంకెందుకీ పక్షి? ఇది నాకొడుకు మనసు మార్చి ఇంట్లోంచి వెళ్ళకుండా చెయ్యగలిగిందా? పెళ్ళయిన నా కూతురి జీవితాన్ని సుఖమయం చెయ్యగలిగిందా? అనుకోవటమేగాని ఎదుటి మనుషుల ఆలోచనలను, ప్రవర్తనలను మార్చటం మనకే సాధ్యం అవకపోతుంటే ఈ పక్షులేం చెయ్యగలవు? అంతా మన భ్రమ—అజ్ఞానం" అని చేతిలో వున్న ఆ పక్షిని వదిలేశాడు దామోదరం.

రెక్కలు టపటప లాడిస్తూ ఒక్క విసురున బయటకు పరుగు తీసింది ఆ కరటపక్షి.

*

(20-1-84 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక)